www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 23 ఆగస్టు 2025



ఈ-వేస్ట్‌పై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి - రాజోలు

పర్యావరణ పరిరక్షణ ధ్యేయంగా పని చేస్తున్న 1ఎం1బి సంస్థ ఆధ్వర్యంలో 1ఎం1బి గ్రీన్ క్లబ్ ప్రారంభించారు. ఈ క్లబ్ ఆధ్వర్యంలో వివేకానంద విద్యార్థులు ఈ వేస్ట్ మేనేజ్మెంటపై తోటి విద్యార్థులు, మలికిపురం పరిసర ప్రాంత ప్రజలకు అవగాహన కల్గించేందుకు సదస్సులు, ర్యాలీలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం విశ్వేశ్వరాయపురంలో ఈ వేస్ట్ మేనేజ్మెంట్ ర్యాలీ నిర్వహించారు. రీ సైక్లింగ్ ద ఈ వేస్ట్ సేవ్ ధ ఎర్త్ అంటూ నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈవేస్ట్ ప్రాజెక్ట్ లీడర్స్ ఎన్.రోజలిన్, పిబి.సాధిక, ప్రాజెక్ట్ సహాయ ఉపాధ్యాయుడు, కరెస్పాండెంట్ పివివి.వరప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పాల్గొన్న విద్యార్థులు

ముంపులో లంకలు

- కాజ్‌వేలపైకి చేరిన నీరు
- లంక గ్రామాల్లో ప్రజలకు తప్పని అవస్థ
- సహాయక చర్యలు చేపట్టిన అధికారులు



మూలస్థానం వద్ద కాజ్ వే కొట్టుకుపోయిన మార్గంలో పడవల రాకపోకలు

ప్రజాశక్తి - యంత్రాంగం

గోదావరి వరద ఉధృతికి శుక్రవారం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమలో లంక గ్రామాలు నీటి మునిగాయి. పలుచోట్ల కాజ్‌వేలపై నీటి చేరింది. పంట పొలాలు, కూరగాయాల, పండ్ల తోటలు ముంపులో ఉన్నాయి. లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరడంతో ప్రజలకు అవస్థలు పడుతున్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తున్నారు. కావలసిన సహాయక చర్యలు చేపట్టారు.

ఆలమూరు: వరద నీరు అధికమవడంతో మండలంలోని మూలస్థానం వద్ద రూ. 8 లక్షలతో నూతనంగా నిర్మించిన కాజ్ వే కొట్టుకుపోయింది. శుక్రవారం ఉదయం ఒక్కసారిగా వరద పోటెత్తడంతో 21 తూరలతో నిర్మించిన ఈ కాజ్‌వే పూర్తిగా వరదనీటి తాకిడికి విడిపోయి తూరలన్నీ కొట్టుకుపోయాయి. ఈ కాజ్ వే అవతల ఉన్న రావులపాలెం మండలం ఊబలంక గ్రామ పంచాయతీకి చెందిన తోకలంక జల దిగ్బంధంలో చిక్కుకుంది. అలాగే వందలాది ఎకరాల పంట భూములు ముంపునకు గురయ్యాయి. దీంతో తోకలంకతో పాటు జొన్నాడ, మూలస్థానం, చొప్పెల్ల లంకలకు చెందిన పంట భూములు ముంపునకు గురయ్యాయి. పలు ఇటుక బట్టీలు కూడా వరద నీటిలో ఉన్నాయి. విషయం తెలుసుకున్న కొత్తపేట ఆర్‌డిఒ పి.శ్రీకర్ కొట్టుకుపోయిన కాజ్ వే వద్దకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. జలదిగ్బంధంలో ఉన్న తోకలంక ప్రజలు రాకపోకలు సాగించేందుకు నాలుగు మర పడవలు ఏర్పాటు చేశారు. అలాగే వారికి ఇబ్బందులు తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలను రావులపాలెం తహశీల్దార్ ముక్తేశ్వరరావు, ఎంపిడిఒ మహేశ్వరరావు, రూరల్ సిఐ విద్యాసాగర్‌లతో ఆర్‌డిఒ చర్చించారు. అలాగే దారి పొడవునా వరద ప్రమాద హెచ్చరిక ఫ్లెక్సీలను వెంటనే ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకున్నారు. ఊబలంక పంచాయతీ కార్యదర్శి శరబరాజు, సచివాలయ కార్యదర్శి గోవిందరాజు, విఆర్‌ఒలు లక్ష్మీపతితావు, సంతోషి లు అక్కడే ఉండి పరిస్థితిని అధికారులకు వివరిస్తున్నారు. **సఖినేటిపల్లి:** మండలంలోని అప్పనిరామునిలంక గ్రామానికి వరద ఉధృతి కారణంగా రాకపోకలు నిలిచిపోయాయి. గ్రామానికి చేరుకుని బాడ్రేవు క్యాజ్ వే బ్రిడ్జి, టేకిశెట్టిపాలెం వద్ద గ్రామానికి చేరుకునే రోడ్డు సైతం నీటిమునిగింది. దీంతో రాకపోకలు సాగించే వారికి ఇబ్బందులు తలెత్తాయి. టేకిశెట్టిపాలెం ఏటిగట్టు వద్ద రెవెన్యూ, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది శిబిరం ఏర్పాటు చేసుకుని సహాయ చర్యలను పర్యవేక్షిస్తున్నారు. సఖినేటిపల్లిలంక సైతం వరద తాకిడికి గురైంది. లోతట్టు ప్రాంతాలు మినహా మిగిలిన ప్రాంతంలో వరద ప్రభావం తక్కువగా ఉంది. **మామిడికుదురు:** వరద ఉధృతి కారణంగా పాశర్లపూడి కరకట్ట దిగువన శుక్రవారం అప్పనపల్లి కాజ్ వే నీట మునిగి రాకపోకలు నిలిచిపోయాయి. మూడు లంక గ్రామాలకు వెళ్లే ప్రధాన ఆర్ అండ్ బి రహదారిలో అప్పనపల్లి పాటురేవులో క్యాజ్ వే పై రెండు అడుగుల మేర వరద నీరు ప్రవహిస్తుండడంతో అప్పనపల్లి పెదపట్నంలంక, బి.దొడ్డవరం గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగ వ్యాపార నిమిత్తం గ్రామం దాటి వెళ్లే వారికి ఇబ్బందులు తలెత్తాయి. ఈ మార్గములో రాకపోకలు పూర్తిగా నిలిపివేసేందుకు అధికారులు ఇరువైపులా చర్యలు చేపట్టారు. పాశర్లపూడి, పెదపట్నం కరకట్టల వద్ద రెవెన్యూ, వైద్య ఆరోగ్య శాఖ, పంచాయతీ రాజ్ సిబ్బంది సహాయ చర్యలను పర్యవేక్షిస్తున్నారు. **అయినవిల్లి:** అయినవిల్లి లంక కాజ్వే వద్ద వరద ఉధృతిని శుక్రవారం పి.గన్నవరం నియోజకవర్గ ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ స్థానిక ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసు కున్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుం డా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మెడికల్ శిబిరాలను స్వయంగా సందర్శి ంచి వైద్య సేవలను పరిశీలించారు. అవసరమైన సదుపాయాలు కల్పించాలని వైద్య సిబ్బందిని కోరారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, పార్టీ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు. పి గన్నవరం నియోజకవర్గం కో-ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు వరద ప్రాంతాన్ని పరిశీలించి, అయినవిల్లి లంక, వీరవల్లి పాలెం బొమ్మరాలతిప్ప గ్రామ ప్రజలకు రాకపోకలు అంతరాయం లేకుండా పడవలను అధిక సంఖ్యలో ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. వైద్య శిబిరం దగ్గర ప్రజలకు కావలసిన ఎమర్జెన్సీ మెడికల్, వరద సమయంలో ముందు జాగ్రత్తగా చర్యలు పరిశీలించారు. ముమ్మిడివరం ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న గోదావరి వరద నీటితో లంక గ్రామాలు ముంపునకు గురవుతున్నాయి. మండలంలోని లంకఆఫ్‌ఠానేలంక, కూనలంక, గురజాపు లంక, కమిని, గేదెల ఒక, అన్నంపల్లి తదితర లంక గ్రామాలు వరద ముంపునకు గురవుతున్నాయి. ముఖ్యంగా చదువుకునే విద్యార్థులు మోకాలు లోతు నీటిలో నుండి పాఠశాలలకు వెళ్ళాల్సిన పరిస్థితుల్లో స్థానికులు బిక్కు బిక్కు మంటూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని జీవనం సాగిస్తున్నారు. మరో పక్క కూరగాయల పంటలు, వాణిజ్య పంటలు నీట మునిగాయి. వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలను అన్ని విధాలా ఆదుకుంటామని ముమ్మిడివరం ఎంఎల్ఎ, ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు హామీనిచ్చారు. మండలంలో వరద ప్రభావిత గ్రామాలైన లంక ఆఫ్ ఠానేలంక, గురజాపులంక, కూనాలంక తదితర ముంపు ప్రభావిత గ్రామాల్లో శుక్రవారం ఎం ఎల్ఎ సుబ్బరాజు స్వయంగా ట్రాక్టర్ నడుపుతూ కూటమి నాయకులను తీసుకువెళ్లి ముంపు ప్రాంత వాసులను పరామర్శించారు. సుబ్బరాజు మాట్లాడుతూ వరద లను ఎదుర్కొనేందుకు యంత్రాంగాన్ని సిద్ధం చేశామని, ప్రమాదమేమీ లేదని, వరద తగ్గుముఖం పట్టిందని, భయాందోళనలు చెందవద్దని హామీనిచ్చారు. కూటమి ప్రభుత్వం ప్రతి ఒక్కరికీ అండగా ఉంటుందన్నారు. ఆయన వెంట చెల్లిఅశోక్, గుత్తుల సాయి, గోలకోటి దొరబాబు, దొమ్మేటి రమణ కుమార్, నడింపల్లి శ్రీనివాస రాజు, పళ్ళా రాజబాబు, తహశీల్దార్ టి.సుభాష్, ఎస్ఐ జ్వాలా సాగర్ తదితరులు ఉన్నారు.



కాజ్ వే మునిగి అప్పనరామునిలంక గ్రామానికి నిలిచిపోయిన రాకపోకలు



కూనాలంక లో మోకాళ్ళ లోతు వరద నీటిలో స్కూల్ కు వెళ్తున్న విద్యార్థులు



అప్పనపల్లిలో కాజ్ వే

సహాయక చర్యలకు సన్నద్ధం కావాలి

అమలాపురం: వరద ప్రభావం తగ్గే వరకూ అప్రమత్తంగా ఉండాలని, వరద ఎక్కువైతే ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టేందుకు సన్నద్ధం కావాలని డిఆర్‌ఒ కొత్త మాధవి అధికారులను ఆదేశించారు. డిఆర్‌ఒ కొత్త మాధవి అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక మండల పరిధిలోని పల్లిపాలెం బోడసకుర్రు గ్రామాలలోనీ వరద ముంపు ప్రభావిత ప్రాంతాలలో పర్యటించారు. వరద తాజా పరిస్థితిపై స్థానిక అధికారులతో సమీక్షించారు. గోదావరి వరద ప్రభావం తగ్గే వరకు అధికారులు అంతా అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దార్ నరసింహారావు, అదనపు డిఎంహెచ్‌ఒ సిహెచ్‌వి భరత లక్ష్మి, వైద్యులు డాక్టర్ స్పందన స్థానిక అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. **ఆత్రేయపురం**: పేరవరం లంకల్లోని రైతులను రెవెన్యూ శాఖ అధికారులు అప్రమత్తం చేశారు. అలాగే వాడపల్లి లంకలో నివాసం ఉంటున్న కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

వరద ప్రభావిత ప్రాంతాల పరిశీలన

ఆలమూరు: మండలంలోని బడుగువానిలంక, మూలస్థానం శివారు తోకలంక వరద ప్రభావిత ప్రాంతాలలో సిఐ సిహెచ్.విద్యాసాగర్, ఎస్ఐ జి.నరేష్ సిబ్బందితో కలిసి శుక్రవారం పర్యటించారు. ఇందులో భాగంగా గజ ఈతగాళ్లతో మరపడవలపై లైఫ్ జాకెట్లు ధరించి వారు ప్రయాణిస్తూ ప్రజలను అప్రమత్తం చేశారు. అలాగే సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని వారికి సూచించారు. అనుకోని సంఘటన ఏదైనా ఎదురైతే తక్షణమే పోలీస్ వారికి సమాచారం అందజేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, గజ ఈతగాళ్లు పాల్గొన్నారు. **కపిలేశ్వరపురం:** గోదావరి వరద ప్రవాహం పెరగడంతో లంక గ్రామాల్లో పల్లపు ప్రాంతాల కు వరద నీరు చేరి పలు రకాల పంటలు ముంపునకుగురయ్యాయి. లంక గ్రామాలైన కేదార్లంక, నారాయణ లంక, వీధి వారి లంక, పల్లపులంక, అద్దంకి వారి లంక, గ్రామాల్లో శుక్రవారం తహశీల్దార్ జి.శ్రీనివాస్, ఫ్లడ్ అధికారులు, విఆర్‌ఒ బృందం పర్యటించింది. వరద పరిస్థితులపై ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, ఫ్లడ్ అధికారులతో సమీక్షించారు.



వరద ముంపు ప్రభావిత ప్రాంతాలలో పర్యటిస్తున్న ఆర్‌డిఒ




ఎంపిడిఒ రాజు, పంచాయతీరాజ్ ఎఇ వీరభద్రరావుకు సన్మానం

సేవా పురస్కార గ్రహీతలకు సన్మానం

ప్రజాశక్తి - ఆలమూరు

స్వాతంత్ర దినోత్సవ వేడుకల లో భాగంగా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ నుంచి ఉత్తమ సేవా పురస్కారాలు పొందిన ఎంపిడిఒ ఎ.రాజు పంచాయతీరాజ్ ఎఇ డి.వీరభద్రరావులను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పలువురు అభినందించారు. అనంతరం వారిద్దరిని సన్మానించారు. వక్తలు మాట్లాడుతూ వారిరువురి సేవలను కొనియాడుతూ వృత్తిలో వారు చూపిస్తున్న చొరవను, అనుభవంతో కూడిన మెలకువలను క్రింది స్థాయి ఉద్యోగులకు తెలియజేయడంలో ముందుంటున్నారన్నారు సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ వృత్తిలో ఎన్నో వడిదొడుకులు ఉంటాయని, వాటిని నిబద్ధతతో అధిగమిస్తూ సేవలు అందించాలన్నారు. అందుకు సహకరి స్తున్న ప్రజా ప్రతినిధులకు, అధికారులకు, నాయకులకు వారు కృతజ్ఞతలు తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్షుడు అద్దరి శ్రీనివాసరావు, మండల పరిషత్ ఎఒ మెహర్ ప్రకాష్, సొసైటీ అధ్యక్షుడు ఈదల వీర్రాజు చౌదరి, ఎఎంసి ఉపాధ్యక్షుడు మేక రాంబాబు, మాజీ ఉపసర్పంచ్ వానపల్లి సత్యనారాయణ, సీనియర్ అసిస్టెంట్ కె.శ్రీనివాసరావు, కంప్యూటర్ ఆపరేటర్ వలీ, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



ఆక్వా రైతులను ఆదుకోవాలని డిమాండ్

ప్రజాశక్తి - అమలాపురం

ఆక్వా రైతును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని ట్రంప్ మోడీ చేసుకున్న వ్యవసాయ ఒప్పందాలను తక్షణమే రద్దు చేయాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర నాయకులు కె.సత్తిబాబు వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కారెంవెంకటేశ్వరరావు, ఏపి కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పీతల రామచంద్రరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ప్రజా సంఘాల కార్యాల యంలో విలేకరులతో ఎపి రైతు కౌలు రైతు వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వేస్తున్న పన్నులు, ఆక్వా రైతు లపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని అన్నారు. సత్తిబాబు, వెంకటేశ్వ రరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని 8 జిల్లాల్లో 4 లక్షల ఎకరా లకు పైగా భూముల్లో రొయ్యల సాగు జరుగుతోందన్నారు. భారత్ నుంచి ఇతర దేశాలకు 7.16 లక్షల టన్నుల ఆక్వా ఉత్పత్తులు ఎగుమతి అవుతున్నాయని అన్నారు. ఇలాంటి స్థితిలో ట్రంప్ ఆక్వా ఎగుమతులపై సుంకాన్ని 50 శాతానికి పెంచడంతో దీని ప్రభావం ఎపిపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతుందన్నారు. ట్రంప్ ప్రకటనతో రొయ్యల ధరలు పడిపోయాయని, అమెరికా సుంకాలతో ఇతర దేశాలకు ఎగుమతి చేసే రొయ్యలు, కౌంట్ ధర తగ్గించి కంపెనీలు కొంటున్నాయని తెలిపారు. రైతులపై సుంకాల ప్రభావం పడకుండా ఉండేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎంపెడా కౌంటర్ గ్యారెంటీ ఇచ్చి ఆక్వా ఉత్పత్తులను ప్రస్తుత ధర కంటే తక్కువ లేకుండా మొత్తం కొనుగోలు చేస్తామని భరోసా ఇవ్వాలని, కేంద్ర ఎక్స్పోర్టర్స్ ధర తగ్గించి కొనుగోలు చేయకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సిఎం వెంటనే ఆక్వా రంగాన్ని ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వంతో అమెరికాతో చేసుకున్న వ్యాపార ఒప్పందాలను రద్దు చేసుకునేలా ఒత్తిడి తీసుకురావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాలో ఆక్వా రైతులను, చిన్న సన్నకారు రైతులను, వ్యవసాయ కార్మికులను కార్మికులను కలుపుకొని అమెరికా భారత్ ఒప్పందాల వల్ల ఆక్వా రంగంపై చూపే ప్రభావాన్ని తెలియ జేస్తూ ఆందో ళన పోరాటాలను ఉధతం చేస్తామన్నారు. ఆక్వా రంగాన్ని ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం అమెరికాతో చేసుకున్న ఒప్పందాలను తక్షణం రద్దు చేసుకోవాలని వారు ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న కారెం వెంకటేశ్వరరావు

ప్రయివేటు డ్రైవర్లను ప్రభుత్వాలు గుర్తించాలి

ప్రజాశక్తి - అమలాపురం

నిత్యం జాతీయ రహదారులపై ప్రయాణం చేస్తూ ప్రజలకు కావాల్సిన నిత్యావసర, అత్యవసర సరుకులు తరలిస్తున్న టువంటి ప్రయివేటు డ్రైవర్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించాలని జయహో రథసారథి యూనియన్ ఉత్తర కోస్తా జిల్లాల అధ్యక్షులు మేలేటి వాసు కోరారు. శుక్రవారం స్థానిక త్రిరత్న బుద్ధ విహార వద్ద గల టాక్సీ స్టాండ్ లో జయహో రథసారథి ప్రయివేటు డ్రైవర్ల యూనియన్ సమావేశం జరిగింది. సమావేశంలో యూనియన్ ఉత్తరకోస్తా జిల్లాల అధ్యక్షులు వాసు మేలేటి, ఆనంద్, భూపతి రాజు, జిల్లా అధ్యక్షులు మంద రామకృష్ణ మాట్లాడారు. దాదాపు 5 సంవత్సరాల కాలంగా రెండు తెలుగు రాష్ట్రాలలో జయహో రథసారథి సంస్థ కొనసాగుతుందన్నారు. ప్రభుత్వాలు డ్రైవర్లను గుర్తించకపోవడంతో ఇప్పటికే జయహో రథసారథి సంస్థ ద్వారా అనేక కార్యక్రమాలు చేస్తోందని అన్నారు. అనేకమందికి సహాయ సహకారాలు అందిస్తూ ప్రమాదాలకు గురై ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న డ్రైవర్లకు సహాయం అందిస్తున్నామన్నారు.ఎంతోమంది రాజకీయ నాయకులను కలసి డ్రైవర్ల సమస్యలపై వినతి పత్రాలు అందించడం జరిగిందన్నారు. ఆటోడ్రైవర్లను ప్రభుత్వం గుర్తించి నట్లుగానే ప్రయివేటు డ్రైవర్లను కూడా గుర్తించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వా లను కోరుతున్నామని అన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అమలాపురం పట్టణ సీఐ వీరబాబును ఘనంగా సన్మానించారు. ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా సిఐ వీరబాబు మాట్లాడుతూ డ్రైవర్లంతా రోడ్డు నిబంధనలను పాటిస్తూ డ్రైవింగ్ చేయాలని సూచించారు. కార్యక్రమం లో వాసంశెట్టి సత్యానందం, దంగేటి దుర్గాప్రసాద్, మంద దుర్గారావు, రత్నాజీ, దొరబాబు, రాఘవేందర్, వాసు, రామారావు, రాఘవేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సిఐ వీరబాబును సన్మానిస్తున్న యూనియన్

చవితి మండపాలకు అనుమతులు తప్పనిసరి

డిఎస్‌పి రఘువీర్

ప్రజాశక్తి - రామచంద్రపురం

నియోజకవర్గంలో చవితి ఉత్సవాలు సందర్భంగా మండపాల ఏర్పాటుకు నిర్వాహకులు తప్పనిసరిగా పోలీస్ అనుమతులు తీసుకోవాలని రామచంద్రపురం డిఎస్‌పి రఘువీర్ విజ్ఞప్తి చేశారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ మండపాల ఏర్పాటుకు ఎటువంటి ఫీజులు చెల్లించాల్సిన అవసరం లేదని, కేవలం అనుమతులు పొందితే సరిపోతుందన్నారు .ఆన్‌లైన్ ద్వారా సులభంగా దరఖాస్తు చేసుకునే సౌకర్యం కల్పించామన్నారు. సింగిల్ విండో విధానం ద్వారా వేగంగా అనుమతులు మంజూరు చేస్తామని చెప్పారు. వినాయక చవితి ఉత్సవాలను నిర్వహించాలనుకునే కమిటీ సభ్యులు ganeshutsav.net వెబ్‌సైట్ ద్వారా కొత్త దరఖాస్తు క్లిక్ చేసి, మొబైల్ నంబర్ నమోదు చేసి ఓటిపి వెరిఫికేషన్ పూర్తి చేయాలని సూచించారు. దరఖాస్తులో నిర్వాహకుల పేరు, మొబైల్ నంబర్, ఇమెయిల్, చిరునామా, అసోసియేషన్, కమిటీ సభ్యుల వివరాలు, వారి ఫోన్ నంబర్లు నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. అలాగే మండపం స్థలం, విగ్రహం ఎత్తు, మండపం ఎత్తు, నిమజ్జనం తేదీ, ఉపయోగించే వాహనాలు తదితర వివరాలు పొందుపరచాలని తెలిపారు. దరఖాస్తు అనంతరం సంబంధిత ప్రాంగణాన్ని పోలీసులు పరిశీలించి అనుమతులు మంజూరు చేస్తారని డిఎస్‌పి రఘువీర్ వివరించారు. వినాయక చవితి ఉత్సవాలను శాంతియుతంగా, ఎటువంటి అల్లర్లు, ఘర్షణలకు తావులేకుండా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు

విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

విద్యార్థులు, చదువుతో పాటు వారి ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అయినాపురం జడ్‌పి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని రామలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని అయినాపురం జడ్‌పి పాఠశాలలో శుక్రవారం కొత్తలంక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఆదేశాల మేరకు వెల్ నెస్ సెంటర్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది పాఠశాల విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారన్నారు. బ్లడ్ శాంపిల్ సేకరించి ఎనిమిక్‌గా ఉన్న విద్యార్థులను గుర్తించి వారికి ఐరన్ మాత్రలు అంద జేస్తారన్నారు. విద్యార్థులను సంపూర్ణ ఆరోగ్య వంతులుగా తీర్చి దిద్దేందుకు ప్రతి ఆరు నెలలకు వైద్య పరీక్షలు నిర్వహించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎల్ఎం హెచ్‌పిలు, టెక్నీషియన్లు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



అయినాపురం జడ్‌పి స్కూల్ ల్లో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు

స్వమిత్వ సర్వేపై జెసి సమీక్ష


ప్రజాశక్తి - అమలాపురం

స్థానిక కలెక్టరేట్ నందు రెండో దశ స్వామిత్వ సర్వే 29 ఆవాసాలలో జరుగుతున్న ప్రక్రియపై డిజిటల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పంచాయతీ కార్యదర్శులు విలేజ్ సర్వేయర్లు, విఆర్‌ఒలతో జెసి టి.నిషాంతి శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె గ్రౌండ్ ట్రూథింగ్, గ్రౌండ్ వాల్యు యేషన్, డేటా ఆధారంగా రోవర్ పాయింట్లు గుర్తింపు వ్యక్తరైజేషన్ దశలను గూర్చి విశదీకరించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాలలో నివసించే ప్రజలకు వారి భూమి హక్కులను నిర్ధారించడానికి, గ్రామ సరిహద్దులను గుర్తించడానికి భారత ప్రభుత్వం చేపట్టిన ప్రక్రియే స్వమిత్వ సర్వే అని అన్నారు. ఒక గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ఆస్తులకు డిజిటల్ రికార్డులు సష్టిం చడం ద్వారా ఆస్తి రికార్డులపై స్పష్టత వస్తుందన్నారు. ఈ సర్వే ద్వారా, గ్రామీణ ప్రాంతాల్లోని భూములకు, ఆస్తులకు సంబంధించిన రికార్డులు కచ్చితంగా తయారవుతాయనీ దీనివల్ల ఆస్తి హక్కుల విషయంలో ఎలాంటి వివాదాలు తలెత్తకుండా ఉంటాయన్నారు. ఆస్తికి సంబంధించిన స్పష్టమైన రికార్డులు ఉన్నప్పుడు, వాటిని హామీగా పెట్టి బ్యాంకుల నుంచి రుణాలు పొందడం సులభం అవుతుం దన్నారు. ఆస్తులకు చట్టబద్ధత లభించడం వల్ల, వాటిని అమ్మడం, కొనడం లేదా పెట్టుబడులు పెట్టడం వంటి ఆర్థిక కార్య కలాపాలు పెరుగుతాయన్నారు. ఇది గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తుందన్నారు. ప్రభుత్వాలు భూమి సంబంధిత పథకాలను, ముఖ్యంగా భూసేకరణకు సంబంధించిన వాటిని సమర్థవంతంగా అమలు చేయడానికి ఈ రికార్డులు ఉపయోగ పడతాయన్నారు. స్థానిక సంస్థలు ఆస్తి పన్నులను వసూలు చేయడానికి ఈ రికార్డులు సహాయ పడతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి శాంతలక్ష్మి డిఎల్‌డిఒలు రాజేశ్వరరావు, త్రినాధరావు, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ సక్రమంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

గ్రామాల్లో చేపట్టిన ఉపాధి హామీ పనులపై నిర్వహించే సామాజిక తనిఖీ సక్రమంగా నిర్వహించాలని ఎస్‌ఆర్‌పి పి.సింహాద్రి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపిడిఒ భూపతి తులసి కృష్ణ అధ్యక్షతన సామాజిక తనిఖీ బృందాలు ఉపాధి సిబ్బంది పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లకు సమన్వయ సమావేశం నిర్వహించారు. 2024-25లో మండలంలోని గ్రామాల్లో జరిగిన ఉపాధి పనులపై ఈనెల 23 నుంచి సెప్టెంబర్ 2 వరకు గ్రామసభలు నిర్వహిస్తారన్నారు. మండలంలో 17 గ్రామపంచాయతీల పరిధిలో ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.15.55 కోట్లతో జరిగిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీల బృందాలు తనిఖీలు నిర్వహిస్తారన్నారు. సమావేశంలో ఇఒపిఆర్‌డి పిఆర్‌సి రాజ్ కుమార్, పిఆర్ ఎఇ వి.రాధాకృష్ణ, ఉపాధి ఎపిఒలు వి. రాజామణి, ఎం.వీరబాబు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌ఆర్‌పి సింహాద్రి

గొందిలో 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ'

ప్రజాశక్తి - సఖినేటిపల్లి

గొంది గ్రామంలో వైసిపి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నియోజకవర్గ ఇన్‌ఛార్జి గొల్లపల్లి సూర్యారావు నిర్వహించారు. మండల వైస్ ఎంపిపి కొల్లాబత్తుల నాని అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గొల్లపల్లి మాట్లాడుతూ ఎన్నికల హామీగా మేనిఫెస్టోలో తెలిపిన పథకాలను అమలు చేయడంలో చంద్రబాబు సర్కార్ విఫలమైందని ఆరోపించారు. కార్యక్రమంలో సఖినేటిపల్లి మండలం అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్, వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చిన్న రాజా, ఈద రవిరెడ్డి, తాడి సహదేవ్, ఒడుగు వెంకట్, ,గేదెల చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న గొల్లపల్లి

పెద్దిరెడ్డిని కలిసిన పితాని

ప్రజాశక్తి - ముమ్మిడివరం

మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పితాని బాలకష్ణ మర్యాద పూర్వకంగా కలిసినట్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో ఉన్న ఎంపి మిథున్‌రెడ్డిని ములకత్‌పై కలవడానికి వచ్చారు.ామచంద్రారెడ్డి ని బయటకు వచ్చిన తరువాత స్థానిక ప్రయివేటు హోటల్ లో బస్ చెందిన రామచంద్రారెడ్డి బాలకృష్ణ మర్యాద పూర్వకంగా కలిసి పలుఅంశాలపై చర్చించారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

స్త్రీ నిధి బకాయిలు వసూలు చేయాలి

ప్రజాశక్తి - ఆలమూరు

స్వయం సహాయక సంఘాల దగ్గర ఉన్న స్త్రీ నిధి బకాయిలు వెంటనే వసూలు చేయాలని డిఆర్‌డిఎ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ కె.హేమలత అన్నారు. మండలంలోని స్త్రీ శక్తి భవనంలో విఒఎలతో శుక్రవారం ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా విఒఎల నుంచి బకాయిలు, వసూళ్ళ తదితర లావాదేవీలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ ఎవరైనా విధులను దుర్వినియోగం చేస్తే తొలగించటం తప్పదని హెచ్చరించారు. ఉన్నతాధికారుల సూచనలు సలహాలు తీసుకుంటూ స్వయం సంఘాల అభివృద్ధికి కషి చేయాలని ఆమె ఆదేశించారు. ఏ ఒక్కరూ లావాదేవీలలో అవకతవకలకు పాల్పడవద్దని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం విఎన్.సత్తిబాబు, స్త్రీ నిధి మేనేజర్లు రవికుమార్, సురేంద్ర, సిసిబిఎస్.రవి కిరణ్, అకౌంటెంట్ కుమార్, విఒఎలు పాల్గొన్నారు.

'స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర'ను జయప్రదం చేయాలి

అధికారులకు కలెక్టర్ ప్రశాంతి ఆదేశం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

జిల్లాలో ఆగస్టు 23న జరగనున్న స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంపై అన్ని విభాగాధిపతులు, మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, జిఎస్‌డబ్ల్యుఎస్ ఇన్‌ఛార్జ్ అధికారులతో కలెక్టర్ శుక్రవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి నెలా 3వ శనివారం స్వర్ణ ఆంధ్ర దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఆగస్టు నెలకు సంబంధించి 'పరిశుభ్రత-వ్యాధుల నివారణ' థీమ్‌తో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. అన్ని గ్రామాలు, పట్టణాల్లో నీటి నిల్వలను తొలగించడం, దోమల నివారణ, నీటి ద్వారా సంక్రమించే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలను చేపట్టాలన్నారు. కార్యాలయాల్లో నిరుపయోగంగా ఉన్న ఫర్నిచర్ తొలగించి, ప్రాంగణాల్లో శుభ్రత వంటివి చేయాలన్నారు. మరుగుదొడ్లు శుభ్రపరచడం, ఫైళ్లు, ర్యాక్‌లు, ఐటీ పరికరాలను శుభ్రపరచి క్రమబద్ధీకరించడం, అలాగే సాసా యాప్‌లో ఈవెంట్ రోజున ఫోటోలు, నివేదికలు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. అలాగే స్వమిత్వ సర్వేను వేగవంతం చేయాలన్నారు. ఇప్పటివరకు 190 గ్రామాల్లో 13వ నోటిఫికేషన్ జారీ అయ్యిందన్నారు. పైలట్ ప్రాజెక్ట్ కింద 15 గ్రామాల్లో పనులు పూర్తయ్యాయని, ప్రస్తుతం 16 గ్రామాల్లో రీ సర్వే కొనసాగుతున్నట్లు ఆమె వెల్లడించారు. ఈ పనులు పకడ్బందీగా జరగాలంటే మండల స్థాయిలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ బృందంలో తహశీల్దార్, మండల సర్వేయర్, నైపుణ్యంతో కూడిన సచివాలయ సర్వే కార్యదర్శి ఉండాలని సూచించారు. ఇఓపిఆర్‌డి నోడల్ అధికారిగా కీలక పాత్ర పోషించాలన్నారు. ప్రతి రోజూ కనీసం ఒక ఎల్‌పిఎం(ల్యాండ్ ప్లాట్ మేజర్‌మెంట్) క్లియర్ చేయడం లక్ష్యంగా పెట్టుకోవాలని, గ్రౌండ్ ట్రూథింగ్ పనులు సమాంతరంగా కొనసాగించాలని ఆదేశించారు. రీసర్వేపై ఎంపిడిఒలు, తహశీల్దార్లు దృష్టి సారించాలన్నారు. క్షేత్ర స్థాయిలో సమన్వయంతో సమయానికి పనులు పూర్తిచేయాలన్నారు. గ్రామాల వారీగా ప్రణాళిక సిద్ధం చేసి, నిర్దేశించిన అంచనాల ప్రకారం రీ సర్వే పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సెక్రటరీ సత్యనారాయణ

హాస్టల్స్‌లో మెరుగైన సేవలు అందించాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

బిసి సంక్షేమ హాస్టల్లో మెరుగైన సౌకార్యలు, మెరుగైన విద్యను అందించేలా చర్యలు తీసుకోవాలని బిసి సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సత్యనారాయణ అదేశించారు. శుక్రవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జరిగిన ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పరిధిలోని హెచ్‌డబ్ల్యూఒల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ హెచ్‌డబ్ల్యూఒల పనితీరును మెరుగు పర్చేందుకు, వారి పనితీరు తెలుసుకునేందుకు నూతన విధానాన్ని తీసుకొచ్చామన్నారు. హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ల విధి నిర్వహణలను విభ జించి ప్రతి దానికి కొన్ని మార్కులు కేటాయించామన్నారు. సెప్టెంబర్ 5 నాటికి రాష్ట్రంలోని వసతిగృహాల్లో 244 మంది నాల్గవ తరగతి సిబ్బందిని నియమిస్తామన్నారు. ఈ సందర్భంగా బిసి సంక్షేమ శాఖ, సంచాలకులు ఎ.మల్లికార్జున మాట్లాడుతూ జిల్లాల్లో ఉన్న డిఎస్‌డబ్ల్యూఒలు విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేలా ముఖ్యపాత్ర పోషించాలన్నారు. ఆయా జిల్లాల కలెక్టర్లను సంప్రదించి ఆయా వసతిగృహాల్లో ఉన్న సమస్యలు తెలియపరిచి వాటి పరిష్కారానికి నిధులు పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. మూడు నెలలకు ఒకసారి జిల్లాల్లో సమీక్ష సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డైరెక్టర్ ఆఫ్‌బిసి వెల్ఫేర్, డిసిఎస్.రాజు, ఎంజెపి రెసిడెన్షియల్ స్కూల్ సెక్రటరీ, పి.మాధవీలత, డిఎస్‌డబ్ల్యూఒలు, బి.శశాంక, సత్యరమేష్, వెంకటేశ్వరరావు, ఎబిసిడబ్ల్యూఒలు పాల్గొన్నారు.

టాప్‌టెన్‌లో 'అరిగెల' కేస్ స్టడీ స్టోరీ

ప్రజాశక్తి - పెరవలి



జాతీయ స్థాయి కేస్ స్టడీ పోటీలు టాప్ 10లో అరిగెల ఆరుణకుమారికి సంబంధించిన ప్రాజెక్టుకు చోటు దక్కింది. ముక్కామల గ్రామానికి చెందిన అరిగెల అరుణకుమారి సర్పంచిగా రాజకీయ ప్రస్తావం ప్రారంభించి నేడు కాంగ్రెస్ పార్టీలో రాష్ట్ర జనరల్ సెక్రటరీ స్థాయికి ఎదిగారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా, ఆయన ప్రవేశపెట్టిన 73వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా మహిళలకు పంచాయతీరాజ్ వ్యవస్థలో 33 శాతం రిజర్వేషన్ కల్పించిన కృషిని స్మరించుకుంటూ రాజీవ్ గాంధీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి కేస్ స్టడీ పోటీ నిర్వహించారు. దేశవ్యాప్తంగా 100కిపైగా ప్రముఖ విశ్వవిద్యాలయాలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు ఈ పోటీలో పాల్గొన్నారు. రాజానగరం నియోజకవర్గం కూనవరానికి చెందిన దూలం అరుణ్‌తేజ అరిగెల అరుణకుమారిపై కేస్ స్టడీ చేశారు. 'ఫ్రం కిచెన్ టు కాన్సిస్టిట్యూషన్' పేరుతో ఆమె కథనాన్ని సమర్పించారు. జాతీయ స్థాయిలో ఈ కేస్‌స్టడీ కథనానికి టాప్‌టెన్‌లో చోటు దక్కింది.

ఏడాదిపాటు శత వసంతాల వేడుకలు

జాంపేట కో ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ బొమ్మన జయకుమార్

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

జాంపేట కో ఆపరేటివ్ బ్యాంకు శత వసంతాల వేడుకలను ఏడాది పాటు నిర్వహిస్తామని బ్యాంకు చైర్మన్ బొమ్మన జయకుమార్ తెలిపారు. శుక్రవారం బ్యాంకులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే ఏడాది ఆగస్టు 22న బ్యాంకు శత వార్షికోత్సవాన్ని నిర్వహిస్తామని తెలిపారు. ఈలోగా నెలకు ఒక బ్రాంచిలో శత వసంతాల వేడుకలు నిర్వహిస్తామని వివరించారు. ఈ సందర్భంగా ఒక సావనీరు ద్వారా తమ బ్యాంకు నూరేళ్ళ ప్రగతిని, సాధించిన విజయాలను ప్రజలకు తెలియచేస్తామని ఆయన చెప్పారు. శత వసంతాల ప్రారంభం సందర్భంగా డిపాజిట్ దారులకు ప్రతి రూ.లక్ష డిపాజిట్‌కు రూ.10 వేలు చొప్పున షేరు ధనం మంజూరు చేయాలని తమ పాలకవర్గం తీర్మానం చేసినట్లు బొమ్మన జయకుమార్ తెలిపారు. ఈ విధంగా మంజూరు చేసే షేరు ధనంపై ఒక్కొక్కరికి రూ.1,50,000 మించ కూడదని నిర్ణయించామన్నారు. ప్రస్తుతం ఉన్న 13 బ్రాంచీలు ద్వారా రూ.793 కోట్ల వ్యాపారం జరుగుతోందన్నారు. ప్రతి సంవత్సరం బ్యాంకు లాభాలను ఆర్జిస్తూ సభ్యులకు క్రమం తప్పకుండా డివిడెండ్ చెల్లిస్తున్నామని తెలిపారు. శత వసంతాల సంవత్సరం నాటికి రూ.900 కోట్ల వ్యాపారం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. మొబైల్ బ్యాంకింగ్ ప్రారంభించామని, అన్ని బ్రాంచీల్లో ఎటిఎం సేవలు కల్పించి వాటి ద్వారా రెండు నుంచి మూడు లక్షల ఆదాయం ఆర్జిస్తున్నామన్నారు. ఎన్‌పిఎని నియంత్రించి జీరో శాతం నెట్ ఎన్‌పిఎ సాధించామన్నారు. డిపాజిట్లపై ఆకర్షణీయమైన వడ్డీ రేట్లు అందించి, గోల్డ్ లోన్లు, హౌసింగ్ రుణాలు, తనఖా రుణాలు మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా వడ్డీ రేట్లు సవరించి వ్యాపారాభివృద్ధి సాధించామని ఆయన చెప్పారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ రొబ్బి విజయశేఖర్, డైరెక్టర్లు ప్రసాదుల హరినాథ్, డి.పార్వతిసుందరి, జామిశెట్టి గాంధీ, మహంతి లక్ష్మణరావు, జామి కృష్ణ, గుంటముక్కల సత్యనారాయణ ప్రసాదరావు, యాండ్రపు రామకృష్ణ, కనకం నాగేశ్వరరావు, ఇన్‌ఛార్జి సెక్రటరీ, సిఇఒ మద్దాల విజయప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా మెగాస్టార్ పుట్టిన రోజు

ప్రజాశక్తి - యంత్రాంగం

సినీనటుడు మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజును శుక్రవారం పలుచోట్ల ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. పేదలకు దుస్తులు, రోగులకు పండ్లు పంచారు. **గోపాలపురంలో** జనసేన పార్టీ కార్యాలయంలో చిరంజీవి యువత అధ్యక్షులు సూర్యభగవాన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ ఇన్‌ఛార్జి దొడ్డిగర్ల సువర్ణరాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. భారీ కేకును కట్ చేసి మాట్లాడారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు, సిబ్బందికి పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు రాజేంద్ర, ఉపాధ్యక్షులు గణపతి, నాయకులు సనారి, రాంబాబు, ఫణింద్ర, ఉమా, ప్రసాద్, నరేష్, శివ, గంగాధర్, రామపండు, రామలీల, బాలు, చిరంజీవి అభిమానులు పాల్గొన్నారు. **దేవరపల్లిలో** జనసేన పార్టీ, చిరంజీవి యూత్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలను నిర్వహించారు. బస్టాండ్ సెంటర్‌లో మదర్ థెరిస్సా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ముఖ్యఅతిథిగా దొడ్డిగర్ల సువర్ణరాజు హాజరై కేక్ కట్ చేశారు. అనంతరం పల్లంట్ల రోడ్డులో గల జైకిసాన్ వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కంబాల సత్తిబాబు, చిరంజీవియువత నియోజకవర్గ ఇన్‌ఛార్జి కవులూరి సత్తిబాబు, జనసేన నాయకులు పి.ప్రసాద్, కె.సత్తిబాబు, జి.శ్రీనివాస్‌తదితరులు పాల్గొన్నారు. **కడియం** మండలం బుర్రిలంక చిరుసేవాసమితి ఆధ్వర్యంలో మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజును ఘనంగా నిర్వహించారు. కడియపులంక పంచాయతీ ఆవరణలో చిరు సేవా సమితి అధ్యక్షులు గెడ్డం శివ, చిరంజీవి అభిమానులు మధ్య కేక్ కట్ చేశారు. పారిశుధ్య కార్మికులకు నూతన వస్త్రాలను, మిఠాయిలను పంచారు. 25ఏళ్లుగా రక్తదాన శిబిరాలు, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న గడ్డం శివ, ఆయన మిత్రబృందాన్ని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి సోము వీర్రాజు, సర్పంచ్ మారిశెట్టి పద్మావతి, మహిళా నాయకురాలు బోడపాటి రాజేశ్వరి, చిరు సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.


భారీ కేకు కట్ చేస్తున్న సువర్ణరాజు

నేరాలు ఘోరాలు

ట్రాక్టర్ బోల్తా మహిళా కూలీ మృతి

ప్రజాశక్తి - గోపాలపురం



ట్రాక్టర్ బోల్తా పడి మహిళా కూలి మృతి చెందింది. మరో ఇద్దరు కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని గుడ్డిగూడెంలో శుక్రవారం చోటు చేసుకుంది. బంధువుల తెలిపిన వివరాల ప్రకారం గుడ్డిగూడెం గ్రామానికి చెందిన ఎనిమిది మంది మహిళలు అదే గ్రామానికి చెందిన రైతుకు చెందిన పొలంలో వరినాట్లు వేసేందుకు ఉదయం 6 గంటలకు వెళ్లారు. పనులు ముగించుకుని సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో రైతు తమ్ముడికి చెందిన ట్రాక్టర్‌లో తిరుగుపయనమయ్యారు. కొవ్వాడ కాలువ గట్టు వద్దకు వచ్చేసరికి ట్రాక్టర్ అదుపుతప్పి కాలువలో బోల్తా పడింది. వెంటనే స్థానికులు జెసిబి సాయంతో ట్రాక్టర్ కింద ఉన్న మహిళలను బయటకు తీశారు. ఈ ప్రమాదంలో సుగ్గనబోయిన వెంకటపద్మావతి(42) అక్కడికక్కడే మృతి చెందింది. మరో ఇద్దరు కూలీలు కత్తవ నాగలక్ష్మి, సుగ్గనబోయిన మంగతాయారు తీవ్రంగా గాయపడ్డారు. మరో ఐదుగురు కూలీలు స్వల్పగాయాలతో బయట పడ్డారు. గాయపడిన వరిని గోపాలపురం సిహెచ్‌సికి తరలించారు. దేవరపల్లి సిఐ నాగేశ్వర్‌నాయక్, తహశీల్దార్ సాయి ప్రసాద్ ఆస్పత్రికి చేరుకుని ప్రమాద వివరాలు సేకరించారు. తీవ్రంగా గాయపడిన వారిని మెరుగైన వైద్యం కోసం మరో ఆసుపత్రికి తరలిస్తున్నట్టు తెలిపారు. మృతురాలు వెంకటపద్మావతికి భర్త, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. భార్యాభర్తలు కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఇద్దరు కుమార్తెలకు వివాహం చేశారు. మరో కుమార్తెకు వివాహం చేయాల్సి ఉంది. పద్మావతి మృతితో ఆ ఇంట విషాదం నెలకొంది.


మాట్లాడుతున్న కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్

ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

ప్రజాశక్తి - అమలాపురం

ఎరువుల అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ హెచ్చరించారు శుక్రవారం రాష్ట్ర వ్యసా య శాఖ మంత్రి కె.అచ్చెన్ననాయుడు, రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు జిల్లా కలెక్టర్లతో అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిఎరువుల కత్రిమ కొరత సరఫరా అంశాలపై సమీక్షించారు. కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో అన్ని రకాల ఎరువులు రిక్వైర్మెంట్ 42 వేల మెట్రిక్ టన్నులు ఉండగా వీటిలో 32 వేల మెట్రిక్ టన్నులు సరఫరా కాబడిందన్నారు. 14 వేల మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందన్నారు. 3800 మెట్రిక్ టన్నులు యూరియా, డిఎపి 700 మెట్రిక్ టన్నులు పొటాషియం 1000 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 7600 మెట్రిక్ టన్నులు, భాస్వరం 1200 మెట్రిక్ టన్నులు ఉందన్నారు. ఈ నెలలో 6,000 టన్నులు సెప్టెంబర్ నెలలో 8,000 మెట్రిక్ టన్నుల ఎరువులు వస్తాయన్నారు. రబి సీజన్లో 71 వేలు జిల్లాకు సరఫరా అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా మార్క్‌ఫెడ్ ఎడి మంజుల, జిల్లా వ్యవసాయ అధికారి బోసు బాబు, జిల్లా సహకార అధికారి రాధాకష్ణ వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

టెన్త్ పూర్తయిన వెంటనే విద్యార్థుల కెరీర్ గైడెన్స్ ద్వారా ఆసక్తి ఉన్న రంగాన్ని ఎంచుకునే నిమిత్తం అవగాహన పొం దుతూ స్థిరపడే విధంగా కార్యాచ రణ రూపొం దిస్తున్నట్లు కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ వెల్లడించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ నందు మామిడికుదురు జడ్‌పి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు చిరంజీవి పూర్వపు విద్యార్థి నవీన్ కెరీర్ గైడెన్స్‌పై పలు అంశాలను రూపొందించారు. కెరీర్ గైడెన్స్ పోర్టల్ రూపకల్పన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నవీన్ కలెక్టర్‌కు వివరించారు.


శ్మశాన వాటికి వద్ద వేసిన చెత్త

దళితుల శ్మశాన వాటికకు దారేది?

గోదావరి రేవులో చెత్త డంపింగ్

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండల కేంద్రం ఆత్రేయపురం గోదావరి రేవులో ఉన్న దళితుల శ్మశాన వాటికకు దారి లేకుండా పోయింది. గ్రామంలో ఇంటికి వెళ్లి సేకరిస్తున్న చెత్తాచెదారాలను గోదావరి రేవులో డంపింగ్ చేయడంతో శ్మశాన వాటికకు దారి లేకుండా పోయింది .దీంతో ఇటీవల కురిసిన వర్షాలకు చెత్త తడిసి దుర్వాసన వెదజల్లుతుంది. చెత్త నుంచి వర్మీ కంపోస్ట్ తయారుచేసి తద్వారా సంపద సష్టించాలన్న ఉన్నతాధికారుల ఆశయాలను పంచాయతీ అధికారుల ఆశలు అడియాశలయ్యాయి. దీంతో గ్రామంలో ఎక్కడ చెత్త వేయడానికి స్థలం లేకపోవడంతో గోదావరి పుష్కరాల రేవు చెంతనే గుట్టలుగా చెత్త డంపింగ్ చేస్తున్నారు. ఈ తరుణంలో గోదావరి రేవులో ఉన్న శ్మశాన వాటిక కు మార్గము లేదు . దళితులు ఎవరైనా మరణిస్తే వారిని శ్మశాన వాటికకు తీసుకెళ్లడానికి దారి లేక నానా అవస్థలు పడుతున్నారు. దీనిపై పంచాయతీ అధికారులకు విన్నవించిన వారు పట్టించుకోవడం లేదంటూ దళితులు ఆవేదన చెందుతున్నారు. గ్రామంలో సేకరించిన చెత్తను ట్రాక్టర్ ద్వారా గోదావరి రేవులో డంపింగ్ చేయడంతో గోదావరికి వరద నీరు చేరినప్పుడు అందులో కలిసిపోయి గోదావరి నీరు కలుషితం అవుతుంది. ఇప్పటికైనా ఉన్నతాధకారులు కలగజేసుకుని చెత్తను అక్కడి నుండి తొలగించి దళితుల శ్మశాన వాటికకు వెళ్లడానికి దారి చూపాలని పలువురు దళితులు కోరుకుంటున్నారు.

రామచంద్రపురం విలీనం కోసం జెఎసి ధర్నా

ప్రజాశక్తి - రామచంద్రపురం

రామచంద్రపురం నియోజకవర్గన్ని కాకినాడ జిల్లాలో కలపాలని అఖిల పక్ష జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. కె.గంగవరం మండల పరిషత్ కార్యాలయం ఎదుట జరిగిన ఈ కార్యక్రమంలో. ప్రజల న్యాయమైన డిమాండ్ అయిన 'రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడ జిల్లాలో విలీనం చేయాలని నినాదాలు చేశారు. రామచంద్రపురం నియోజక వర్గ అఖిలపక్ష జెఎసి తరపున కన్వీనర్ మాగాపు అమ్మిరాజు, కో-కన్వీనర్ బి.సిద్ధూ, సిపిఐ నాయకులు పి.రాము, జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి బుంగ రాజు, రామచంద్ర పురం నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కోట శ్రీను, విక్టర్ నంద తదితరులు మాట్లాడుతూ అమలాపురం జిల్లా కేంద్రం రామచం ద్రపురం నుంచి దాదాపు 60 కిమీ. దూరంలో ఉండడం వల్ల ప్రజలు పరిపాలన, వైద్యం, విద్య, రవాణా, ఉద్యోగావకాశాల విషయంలో తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మరోవైపు కాకినాడ జిల్లా కేంద్రం రామచంద్రపురానికి కేవలం 25 కి.మీ. దూరంలో ఉందని, అక్కడే ఆధునిక వైద్య సదుపాయాలు, విశ్వవిద్యాలయం, కళాశాలలు, ఉపాధి అవకాశాలు, పరిపాలన అందుబాటులో ఉన్నాయని వివరించారు. జెఎసి ప్రతినిధులు కె.గంగవరం ఎంపిపి పంపన నాగమణి, ఎంపిపిలకు, గ్రామ సర్పంచ్‌లకు వినతిపత్రాలు సమర్పించి, మండల పరిషత్ కౌన్సిల్‌లో తీర్మానం చేయాలని కోరారు. పంపన నాగమణి, సుబ్బారావు బాలాంత్రం సర్పంచ్ చాగంటి సాంబశివరావు, తామరపల్లి సర్పంచ్ తోకల శ్రీనివాస్ సానుకూలంగా స్పందించారని అన్నారు. కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు వెంటపల్లి భీమా శంకరం, అంబటి కృష్ణ, సిపిఐ నాయకులు శారద, జనసేన నాయకులు నల్లా వెంకటేష్, సుధాకర్, నున్నచిట్టిబాబు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఖాన్, ఎఐకెఎంఎస్ గంగవరం మండల నాయకులు రాజా రెడ్డి, కాశీ లెనిన్, లక్ష్మణ్, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష

ప్రజాశక్తి - ఆలమూరు

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ఎంపిడిఒ ఎ.రాజు, పంచాయతి రాజ్ ఎఇ డి.వీరభద్రరావు శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా జరుగుతున్న, జరిగిన, జరగబోయే పనులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరద తాకిడి నీ నియంత్రించేలా మనం చేసే అభివద్ధి పటిష్టంగా జరగాలన్నారు. రాబోయే పుష్కరాల నేపథ్యంలో లంక గ్రామాలను క్షుణ్ణంగా పరిశీలించి పుష్కర ఘాట్లు, దోబీ ఘాట్లు వంటివి పటిష్టంగా నిర్మించేందుకు ప్రణాళికలతో కూడిన అంచనాలను రూపొందించాలన్నారు. ముఖ్యంగా డ్రయినేజీ వ్యవస్థ, రోడ్లు, శానిటేషన్ విభాగాలు ఎలా పనిచేస్తున్నాయనే దానిపై దృష్టి సారించాలని వారు ఆదేశించారు. గ్రామాలలో ఇప్పటికే కొన్ని సిసి రోడ్లు నిర్మించడం జరిగిందని, వాటికి డ్రయినేజీలు, బెర్మలు ఏర్పాటు వంటివి క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఏవో మెహర్ ప్రకాష్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, గుత్తేదారులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవా అవార్డు గ్రహీతలకు సన్మానం

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

ఉత్తమ సేవా అవార్డు గ్రహీతలను పలువురు శుక్రవారం సన్మానించారు. ఇటీవల 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలలో అమలాపురం డివైఇఒ, ఎంఇఒ-1 గుబ్బల సూర్య ప్రకాశం, జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల పాలగుమ్మి పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్ పోలిశెట్టి నరసింహచంద్రకుమార్ లు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, జెసి టి.నిషాంతి చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారాలు స్వీకరించారు. ఈ మేరకు శుక్రవారం అమలాపురం డివైఇఒ ఆఫీసులో జరిగిన సన్మాన కార్యక్రమంలో డివైఇఒ, ఎంఇఒ-1 గుబ్బల సూర్య ప్రకాశం, పోలిశెట్టి నరసింహ చంద్రకుమార్ లని అమలాపురం మండల పార్ట్ టైం ఇనస్ట్రక్టర్లు ఘనంగా సన్మానించారు.

ఘనంగా చిరంజీవి పుట్టిన రోజు వేడుకలు

ప్రజాశక్తి - యంత్రాంగం

నటుడు చిరంజీవి పుట్టినరోజు వేడుకలను శుక్రవారం ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. ప్రజాప్రతినిధులు పాల్గొనికేక్ కట్‌చేశారు. **అమలాపురం:** స్థానిక గడియార స్థంభం సెంటర్ వద్ద జరిగిన కార్యక్రమంలో ఎంఎల్‌ఎ అయితాబత్తుల ఆనందరావు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు పాల్గొన్నారు. అనంతరం పేదలకు వస్త్రాలు, పండ్లు, స్వీట్స్ పంపిణీ చేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. **మండపేట:** అఖిలభారత చిరంజీవి యువత అధ్యక్షులు కొంతం ప్రసాద్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు. మండపేట ఆదర్శ హెల్పింగ్ హాండ్స్ నందు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. **ఉప్పలగుప్తం:** గొల్లవిల్లిలో కడియం సందీప్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంఎల్‌ఎ ఆనందరావు కట్ చేసి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. చిరంజీవి యువత అందించిన ఆర్థిక సహాయాన్ని పేద విద్యార్థులకు ఎంఎల్‌ఎ ఆనందరావు అందజేసి సద్వినియోగం చేసుకుని విద్యలో ఉన్నతులుగా ఎదగాలని సూచించారు. **కొత్తపేట:** ముందుగా స్థానిక పాత బస్టాండ్ సెంటర్లో చిరంజీవి అభిమానులు కేక్ కట్ చేసి స్వీట్స్ పంచిపెట్టారు. అనంతరం పలువురు రక్తదానం చేశారు. **అయినవిల్లి:** ముక్తేశ్వరంలో నిర్వహించిన కార్యక్రమానికి పి.గన్నవరం ఎంఎల్‌ఎ గిడ్డి సత్యనారాయణ, తదితరులు హాజరయ్యారు.

'వికలాంగులపై ప్రభుత్వం కక్ష'

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

అనర్హుల ఏరివేతపేరుతో వికలాంగులపై కూటమి ప్రభుత్వం కక్ష కట్టిందని అర్హులైన వికలాం గులు వేలమందిని రాష్ట్రవ్యాప్తంగా తొలగించిందని వికలాంగుల సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు చేట్ల విద్యాసాగర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉప్పలగుప్తంలో విద్యాసాగర్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఓవైపు పింఛన్లు పెంచుతున్నామంటూ మరోవైపు పింఛన్లు తొలగించి వికలాంగ కుటుంబాలను రోడ్డున పడేయడం న్యాయం కాదన్నారు. పింఛన్ తీసుకునే వారిలో అనర్హులు ఉన్నారంటూ అనర్హులను గుర్తించే క్రమంలో నిజమైన వికలాంగులను కూడా తొలగించే కార్యక్రమం కూటమి ప్రభుత్వం చేపట్టిందని విమర్శించారు. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే రానున్న రోజుల్లో పింఛను ఒక్కటే కాకుండా సంక్షేమ ఉద్యోగ అవకాశాలు వికలాంగులు కోల్పోయేటట్టు ఈ ప్రభుత్వం చేస్తుందన్న అనుమానం కలుగుతోందన్నారు. పింఛనుపైనే ఆధారపడి జీవిస్తున్న వికలాంగుల కుటుంబాలకు ప్రభుత్వం న్యాయం చేయాలని విద్యాసాగర్ డిమాండ్ చేశారు.

పింఛన్ల తొలగింపుపై అసత్య ప్రచారాలను మానుకోవాలి

ప్రజాశక్తి - అయినవిల్లి

వైసిపి పి.గన్నవరం నియోజకవర్గ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు, వైసిపి నాయకులు పింఛన్లు తొలగిస్తున్నారు అంటూ అసత్య ప్రచారాలు చేస్తున్నారని అంబాజీపేట మార్కెట్ కమిటీ చైర్మన్ చిట్టూరి శ్రీనివాస్ అన్నారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ వైసిపి నాయకులు ఈ ప్రచారాన్ని మానుకోవాలని హితవు పలికారు. వైసిపి నాయకులు వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు. అర్హులైన ఏ ఒక్క లబ్ధిదారుడికి అన్యాయం జరక్కుండా అధికారులు తగు చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మద్దాల సుబ్రహ్మణ్యేశ్వర రావు, మండల టిడిపి అధ్యక్షులు వస్కా శ్యామ్ సుందర్,మధుర రమేష్,పాము శ్రీనుబాబు పాల్గొన్నారు.

రైల్వే టిక్కెట్ కౌంటర్‌కు అనుమతి

ప్రజాశక్తి - అమలాపురం

రైల్వే ప్రయాణికులకు అమలాపురంలో రైల్వే టికెట్ కౌంటర్ తిరిగి ప్రారంభించాలని ఎంపీ హరీష్ కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవికి వినతి పత్రం అందిం చారు. రైల్వే కౌంటర్ ప్రారంభించేందుకు అనుమతి ఇస్తున్నట్లు హరీష్ మాధుర్ కు ఆయన చెప్పారు. ఆ మేరకు లేఖ వచ్చినట్లు ఎంపీ కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది.

చవితి ఉత్సవాలు శాంతియుతంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - ఆత్రేయపురం

వినాయక చవితి ఉత్సవాలు శాంతియుతంగా నిర్వహించుకోవాలని రూరల్ సిఐ సిహెచ్. విద్యాసాగర్ అన్నారు. శుక్రవారం మండలంలోని ర్యాలి గ్రామంలో చవితి ఉత్సవాలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. సిఐ మాట్లాడుతూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తే అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామని, ఉత్సవాలను శాంతియుతంగా చేసుకోవాలన్నారు. గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ నాయకులతో మాట్లాడారు. వినాయక మండపాలు ఏర్పాటు చేసేవారు రాష్ట్ర పోలీసుల సింగిల్ విండో పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో అనుమతులు తీసుకోవాలని నిమజ్జన సమయంలో ట్రాఫిక్ కు శాంతిభద్రతలకు భంగం కలగకుండా జాగ్రత్తలు పాటించాలని కోరారు.

యూత్‌ఫెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ఆలమూరు

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ యూత్ ఫెస్ట్ లో భాగంగా శుక్రవారం రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో అమలాపురంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్విజ్ పోటీలో మండలంలోని కొత్తూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. కళాశాలకు చెందిన బొక్కా యోగ శ్రీవల్లి, వాసంశెట్టి సంధ్యలు ఈ క్విజ్ పోటీల్లో ప్రథమ స్థానం సాధించి రూ.5 వేల నగదు, ప్రశంసా పత్రం గెలుపొందారు. రాష్ట్రస్థాయిలో ఈ నెల 26న విజయవాడలో జరిగే క్విజ్ పోటీలలో వీరు పాల్గొననున్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ నల్లమిల్లి సురేష్ రెడ్డి, నోడల్ ఆఫీసర్ జక్కంపూడి గోవిందు, ప్రముఖ పారిశ్రామికవేత్త వంటిపల్లి పాపారావు, సిబ్బంది అభినందించారు.

బాధిత కుటుంబానికి సాయం

ప్రజాశక్తి - రాజోలు

ములికిపల్లి గ్రామానికి చెందిన ఇంగువ లక్ష్మీ వినయ్‌కుమార్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. వారిది పేద కుటుంబం కావడం తో వైద్యం చేయించడానికి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నట్లు తెలుసుకునీ తనవంతు సాయంగా వారి కుటుంబ సభ్యులకు శుక్రవారం రాజోలు సిఐ నరేష్ కుమార్ రూ.10వేలు అందజేశారు. భవిష్యత్తులో కూడా వారికి ఏ అవ సరం వచ్చిన సహాయం చేస్తానని, స్వచ్ఛంద సం స్థలతో కూడా మాట్లాడి సహాయం చేస్తానని సిఐ హామీ ఇచ్చారు.

సర్పంచ్ బ్రహ్మాజీ అంత్యక్రియల్లో పాల్గొన్న జగ్గిరెడ్డి

ప్రజాశక్తి - ఆత్రేయపురం

కట్టుంగ గ్రామ సర్పంచ్ కరటూరి బ్రహ్మాజీ అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మరణించారు. ఆయన అంత్యక్రియలు శుక్రవారం జరి గాయి. బ్రహ్మాజీ పార్థివదేహానికి నియోజవర్గ మాజీ ఎంఎల్‌ఎ, చిర్ల జగ్గిరెడ్డి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బ్రహ్మాజీ అంత్యక్రియలు జగ్గిరెడ్డి కార్యక్రమంలో పాల్గొని స్వయంగా పార్థివదేహాన్ని మోశారు.

జొన్నాడలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

ప్రజాశక్తి - ఆలమూరు

జొన్నాడలో రావులపాలెం రూరల్ సిఐ సిహెచ్.విద్యాసాగర్ శుక్రవారం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించి పలు కేసులు నమోదు చేశారు. అలాగే హెల్మెట్ ధరించని 20 మందిపై సుమారు రూ.పదివేలు అపరాధ రుసుము, రికార్డు సక్రమంగా లేని వాహనాలపై కూడా కేసులు నమోదు చేశారు.

ఎంపిటిసి సభ్యురాలు పద్మావతి రాజీనామా

ప్రజాశక్తి - మామిడికుదురు

పెదపట్నం జనసేన తరపున ఎంపిటిసి సభ్యురాలిగా కడలి పద్మావతి ఆవా వర్కర్‌గా ఎంపికైయింది. ఆమె ఈనెల 21న కాకినాడ వెళ్లి స్వయంగా జడ్‌పి సిఇఒ వివివిఎస్.లక్ష్మణరావుకు రాజీనామా పత్రాలను అందజేశారు. తాను వైద్య ఆరోగ్యశాఖలో ఆశా కార్యకర్తగా ఎంపికయ్యానని, ఆశా కార్యకర్తగా విధులు నిర్వహించాలని నిర్ణయించుకున్నానని పద్మావతి తెలపడంతో ఆమె రాజీనామాను ఆమోదిస్తూ శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంనకు ఆదేశాలు జారీ చేసినట్లు డిప్యూటీ ఎంపిడిఒ అడబాల శ్రీనివాసరావు తెలిపారు